క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ ఆదివారం తెలిపారు. 6వ తరగతిలో 33, 7వ తరగతిలో 26, 8వ తరగతిలో 15, 9వ తరగతిలో 9 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థినులు ఈనెల 28లోగా పాఠశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుకు ఆధార్, రేషన్‌కార్డు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల జెరాక్స్‌లను జత చేయాలని సూచించారు. ఈ నెల 30న ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్ష ఉంటుందని, ఏ తరగతిలో ప్రవేశించదలచుకున్నారో దానికి ముందు తరగతి పాఠ్యాంశాలపై ప్రశ్నాపత్రం ఉంటుందని వివరించారు.

నేడు మంత్రి బొత్స పర్యటన

మెరకముడిదాం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండలంలో సోమవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావు తెలిపారు. ఉత్తరావల్లి గ్రామంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.21 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనాన్ని ఉదయం 8:30 గంటలకు ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం మెరకముడిదాంలో జిల్లా కో– ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని అధికారుల తో పాటు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

28న మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిశోర్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

నోటరీ న్యాయవాదిగా రాంబాబు


లెంక రాంబాబు

గజపతినగరం: స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టుకు నోటరీ న్యాయవాదిగా లెంక రాంబాబును నియమిస్తూ అమరావతి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తోటి న్యాయవాదులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తనను నోటరీ న్యాయవాదిగా అయిదేళ్ల పాటు కొనసాగేలా ఉత్తర్వులు వచ్చాయని రాంబాబు తెలిపారు.

నేడు 'స్పందన'


దత్తిరాజేరు: ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

వైభవంగా జగన్నాథస్వామి తిరువీధి


స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

జామి: జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఏ.ఆర్.పేటలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు సీతారామాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి తిరువీధిని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ మెంబర్లు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఆదివారం మాదిరిగానే అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో ఆలయం వద్ద భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

రాజరాజేశ్వరీదేవికి పూజలు

బొండపల్లి: ఆషాడ మాసోత్సవంలో భాగంగా దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పీహెచ్‌సీలకు మహర్దశ

- నాడు–నేడులో భాగంగా పీహెచ్‌సీలకు నూతన భవనాలు
- ఎస్.కోట నియోజకవర్గంలో రూ. 8.25 కోట్లతో పనులు
- ఆగస్టు నెలాఖరుకు అందుబాటులోకి భవనాలు


శతశాతం పనులు పూర్తయిన జామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం

కొత్తవలస:

ఇరుకు గదులు, శిథిల భవనాల్లో కాలం వెళ్లదీస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)కు ఇన్నాళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. ప్రజారోగ్యానికి ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామాల్లోని ప్రజలకు అన్ని వసతులతో కూడిన మెరుగైన ఆరోగ్యసేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్యరంగంపై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. నాడు–నేడు పథకం ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తుండడంతో ఆస్పత్రులు కొత్తశోభను సంతరించుకుంటున్నాయి. శృంగవరపుకోట నియోజకవర్గంలో అయిదు పీహెచ్‌సీలకు ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ భవనాల నిర్మాణం శరవేగంగా సాగుతుండడంతో ఆయా ఆస్పత్రుల్లో శిథిల భవనాల్లో, అరకొర సౌకర్యాల మధ్య విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి, సేవలు పొందుతున్న రోగులకు త్వరలో అవస్థలు తప్పనున్నాయి.

అయిదు పీహెచ్‌సీలకు రూ.8.25 కోట్లు

నియోజకవర్గం పరిధిలో తొమ్మిది పీహెచ్‌సీలు ఉన్నాయి. ఇందులో జామి, అలమండ, లక్కవరపుకోట, కొత్తవలస, వియ్యంపేట ఆస్పత్రుల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. నూతన భవనాలు మంజూరు చేయాలని గత ప్రభుత్వంలో ఎన్నిమార్లు వైద్యాధికారులు ఉన్నతాధికారుల వద్ద


దాదాపు పూర్తయిన ఎల్.కోట పీహెచ్‌సీ భవనం

మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చొరవతో నియోజకవర్గంలోని అయిదు పీహెచ్‌సీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో ఆస్పత్రిలో భవనాల నిర్మాణానికి రూ.1.65 కోట్లు చొప్పున మొత్తం రూ. 8.25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

శరవేగంగా నిర్మాణ పనులు

జామి, అలమండ, లక్కవరపుకోట, కొత్తవలస, వియ్యంపేటలో ఆస్పత్రుల భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్కవరపుకోట, జామి, అలమండలో పాత భవనాలు ఉంటుండగా ఆస్పత్రి ప్రాంగణంలో నూతన భవనాలను నిర్మిస్తున్నారు. వియ్యంపేట,కొత్తవలసలో పాత భవనాలను తొలగించి వాటి స్థానంలో నూతన నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుతం వియ్యంపేట,కొత్తవలస పీహెచ్‌సీలను వేరే భవనాల్లో నిర్వహిస్తున్నారు. జామి పీహెచ్‌సీ భవనం పనులు 90 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం పెయింటిగ్ పనులు జరుగుతున్నాయి. లక్కవరపుకోటలో పెయింటింగ్, ఫ్లోరింగ్ పనులు మిగిలి ఉన్నాయి. వియ్యంపేట, అలమండలో భవనాల నిర్మాణ పనులు 70 శాతానికి పైగా పూర్తయ్యాయి. కొత్తవలసలో కొంత ఆలస్యంగా పనులు ప్రారంభం కావడంతో ప్రస్తుతం భవనాల పనులు లింటల్ లెవెల్‌లో ఉన్నాయి. అన్ని సదుపాయాలతో నూతన భవనాలను నిర్మిస్తున్నారు.


వియ్యంపేటలో శ్లాబు దశలో పీహెచ్‌సీ భవనాల పనులు

ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేస్తాం



పీహెచ్‌సీల నూతన భవనాల నిర్మాణాన్ని ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేసి, భవనాలను అందుబాటులోకి తీసుకువస్తాం. ఇప్పటివరకు చేపట్టిన పనులకు బిల్లులు చెల్లింపులు కూడా పూర్తయ్యాయి. నిర్మాణాలకు నిధుల కొరత లేదు. కొత్తవలస, వియ్యంపేటలో పనులు కాస్త ఆలస్యమయ్యాయి. ఆ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నాం.

– ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ డీఈఈ, ఎస్.కోట డివిజన్.

పీహెచ్‌సీల రూపురేఖలు మారుస్తున్నాం



ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కరోనా కారణంగా రెండేళ్లు ప్రభుత్వాన్ని ఆర్థిక ఇబ్బందులు వెంటాడినా, ఎక్కడా అభివృద్ధి పనులను మాత్రం ఆపలేదు. నియోజకవర్గంలో పీహెచ్‌సీల రూపురేఖలను మారుస్తున్నాం. అయిదు పీహెచ్‌సీలకు నూతన భవనాలు మంజూరు చేశాం. అధికారుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలో నూతన భవనాలను అందుబాటులోకి రానున్నాయి.

– కడుబండి శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే

పేదల అభ్యున్నతికి నిరంతర కృషి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు


మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

గంట్యాడ: పేదల అభ్యున్నతికి నిరంతరం పాటుపడే వ్యక్తి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు అన్నారు. మండలంలోని నీలావతి గ్రామంలో ఆదివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు అభివృద్ధి చెందాలని పరితపించే గొప్ప మనసున్న వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల ముంగిటకే సేవలు అందిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రజలకు మేలు జరుగుతుంటే చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ప్రతీ దానికి రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, ఎంపీటీసీ గులిపల్లి మంగమ్మ, సర్పంచ్ వర్రి సుధ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నారాయణమూర్తిరాజు, లచ్చిరెడ్డి కృష్ణ, పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయండి


అనారోగ్యంతో బాధపడుతున్న ఆవును పరిశీలిస్తున్న బంగారునాయుడు

గుర్ల: పశువులు వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయాలని పశువైద్యాధికారులకు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు ఆదేశించారు. మండలంలోని రాగోలులో వరుసుగా నాలుగు పశువులు మృతి చెందగా, మరికొన్ని పశువులు అనారోగ్యంతో బాధపడుతున్నాయి. అనారోగ్యంతో ఉన్న పశువులను బంగారునాయుడు ఆదివారం పరిశీలించారు. గ్రామంలో ఉన్న 450 పశువులకు వెటర్నరీ వైద్యులు వైద్యపరీక్షలు చేసి అవసరమైన టీకాలు, వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట ఎంపీటీసీ గిడిజాల రామకృష్ణ, స్థానిక నేతలు ఉన్నారు.

చేయూతనందించడం ఆనందదాయకం


సీఎం చిత్రపటం వద్ద జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం టౌన్: విశ్వబ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించడం ఆనందదాయకమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనాప్రసాద్ అన్నారు. జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి ముక్కాముల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కర్రల మార్కెట్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జనాప్రసాద్ మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణుల ఆరాధ్యదైవం మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలన్నింటికీ ధూపదీప నైవేద్య ఖర్చులకు ప్రతినెలా రూ. 5 వేలు అందించే పథకం వర్తింపజేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మారోజు శ్రీనివాసరావు, బొద్దూరు లక్ష్మణరావు, 3వ డివిజన్ ఇన్‌చార్జ్ రాంప్రసాద్, సంఘం ఉపాధ్యక్షుడు గరుగు నాగరాజు, తామరాపల్లి అప్పలాచారి, పొన్నాడ శ్రీనివాసరావు, బ్రహ్మాజీ, రమణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి సహాయం

వేపాడ: మండలంలోని సోంపురం పంచాయతీకి చెందిన నర్సిపల్లి మెట్టపై శ్రీదేవీ క్వారీలె పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందికి జారిపడి మృతి చెందిన కార్మికుడు కుటుంబానికి రూ.8లక్షల పరిహారం చెల్లించేందు కు క్వారీ యాజమాన్యం అంగీకరించిందని సీఐటీయూ నాయకుడు చల్లా జగన్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పోలీగూడ గ్రామానికి చెందిన గెమ్మెల బుద్దు (30) మెట్టపై శనివారం క్వారీ పనిచేస్తుండగా జారి పడి చనిపోయారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని క్వారీ యాజమాన్యంతో సీఐటీయూ నాయకుడు చల్లా జగన్, కార్మికులు ఆదివారం చర్చలు జరిపారు. రూ.8 లక్షలు పరిహారం చెల్లించడంతో పాటు ఇన్స్యూరెన్స్ డబ్బులు వచ్చేవరకు కార్మికుడి జీతంలో సగం డబ్బులను ఆయన కుటుంబానికి చెల్లించడానికి క్వారీ యాజమాన్యం అంగీకరించిందని జగన్ చెప్పారు. అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు, కార్మిక సంఘాల నాయకులు, క్వారీ యజమానులు రమణమూర్తి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖరీఫ్‌కు సన్నద్ధం


నారుమడిని తయారు చేస్తున్న రైతు

- నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 17,848 ఎకరాలు
- గ్రామాల్లోని ఆర్బీకేల్లో ప్రారంభమైన వరి విత్తనాల పంపిణీ
- అందుబాటులో ఎరువులు, 7,782 క్వింటాళ్ల వరి విత్తనాలు
- 41,427 మంది రైతుల ఖాతాల్లో రూ.31.07 కోట్ల రైతుభరోసా నగదు జమ

2023-24 ఏడాదికి సంబంధించి ప్రభుత్వం ఇటీవల అందించిన రైతు భరోసా సహాయం

మండలం	రైతులు	చేకూరిన లబ్ధి
శృంగవరపుకోట	9,967	రూ.7.47 కోట్లు
లక్కవరపుకోట	1,0179	రూ.7.64 కోట్లు
జామి	6,059	రూ.4.54 కోట్లు
వేపాడ	8,683	రూ.6.51 కోట్లు
కొత్తవలస	6,539	రూ.4.90 కోట్లు

ఎస్.కోట నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం, కేటాయించిన ఎరువులు, విత్తనాలు

మండలం	సాధారణ విస్తీర్ణం (ఎకరాలు)	విత్తనాలు (క్వింటాళ్లు)	ఎరువులు (మెట్రిక్ టన్నులు)
కొత్తవలస	1,010	488	198.3
జామి	5,234	2,160	389.6
లక్కవరపుకోట	3,889	1,885	312
శృంగవరపుకోట	4,142	1,820	192.3
వేపాడ	3,573	1,429	114.9

కొత్తవలస: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పాటు తొలకరి జల్లులు కురుస్తుండడంతో ఖరీఫ్ సీజన్ వరిసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలాల వారీగా సాగు విస్తీర్ణం ఆధారంగా వ్యవసాయ అధికారులు పంపించిన ఇండెంట్ ప్రకారం ఇప్పటికే వరి విత్తనాలను, వివిధ రకాల ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం కేటాయించింది. రైతు భరోసా పథకం ద్వారా సాగు పెట్టుబడి సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేకుండా గ్రామాల్లోనే రైతుభరోసా కేంద్రాల(ఆర్బీకే) ద్వారా రైతులకు వివిధ రకాల వరి విత్తనాలను రాయితీపై అధికారులు పంపిణీ చేస్తున్నారు. దీంతో రైతులు ఉత్సాహంగా సాగుకు సన్నద్ధం అవుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు నారుమడులు తయారు చేసే పనుల్లో బిజీగా ఉన్నారు.

ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు,పురుగు మందులు అన్నీ ఆర్బీకేలకు చేరాయి. గ్రామాల్లో వ్యవసాయ సహాయకుల ఇంటింటికీ వెళ్లి రైతుల అవసరాలను అడిగి తెలుసుకుంటూ, సేద్యంలో మెలకువలను వివరిస్తున్నారు. ప్రతీ రైతుకు పూర్తిస్థాయిలో విత్తనాలు అందజేస్తాం.

– ఎల్.విజయ, కొత్తవలస సబ్‌డివిజన్ ఏడీఏ.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



సాగుకు సంబంధించి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. గతంలో తొలకరి వచ్చిందంటే వరి విత్తనాలకోసం మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఉదయం నుంచి సాయింత్ర వరకు లైన్‌లో నిల్చున్నా విత్తనాలు దొరికేవి కావు. ప్రస్తుతం గ్రామాల్లోనే ఆర్బీకేల ద్వారా విత్తనాలు,ఎరువులు అందజేస్తున్నారు. పెట్టుబడి సహాయం కూడా ఇస్తున్నారు. పంటను కల్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. రైతులకు ఇంతకంటే ఇంకేం కావాలి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– గుల్లిపల్లి అప్పలరాజు రైతు, శ్రీరాంపురం, ఎల్.కోట మండలం.

సంతృప్తస్థాయి సేవలే లక్ష్యం

- 'జగనన్న సురక్ష'ను విజయవంతం చేద్దాం
- ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

చీపురుపల్లి: రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి సంతృప్త స్థాయిలో సేవలందించడమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాల యంలో నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులతో 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి 30 వరకు ప్రతీ ఇంటికి అధికారులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు వెళ్లాలని చెప్పారు. 11 అంశాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. మండల అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రతీ సచివాలయంలోనూ ఒక రోజంతా గడుపతారని చెప్పారు. అంతకుముందే వలంటీర్లు, గృహ సారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. తర్వాత షెడ్యూల్ ప్రకారం అధికారుల బృందం సచివాలయాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని, అదేరోజున 'జగనన్నకు చెబుదాం' డెస్క్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జగనన్న సురక్షలో ఉన్న 11 అంశాలకు మించి ఏవైనా సమస్యలు ఉంటే 'జగనన్నకు చెబుదాం' డెస్క్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఇంతవరకు ప్రతీ సచివాలయానికి ఇద్దరు గృహ సారథులు మాత్రమే ఉన్నారని, మరో గృహ సారథిని నియమించుకోవాలని సీఎం జగన్ సూచించినట్లు తెలిపారు.


సమావేశానికి హాజరైన నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు

ఏమీ చేయని వారే గొప్పలు చెప్పుకుంటున్నారు

గతంలో అధికారంలో ఉండి ఎలాంటి సంక్షేమం, అభివృద్ధి చేయకుండా, ఇచ్చిన హామీలు అమలు చేయని వారే మరోసారి ప్రజల్లోకి వచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని, అలాంటిది నాలుగేళ్ల పరిపాలనలో 98 శాతం హామీలు అమలు చేసిన మనం ఎంత చెప్పుకోవాలో ఎవరికి వారే ఆలోచన చేయాలని పార్టీ నాయకులకు జెడ్పీ చైర్మన్ దిశా నిర్దేశం చేశారు. అర్హులకు నిష్పక్ష పాతంగా పథకాలు అందించిన గొప్ప ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో పని చేస్తున్నందుకు గర్వపడాలన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దనరావు, పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు, గరివిడి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, పొన్నాడ కుమార్, గుర్ల జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, నాయకులు పొట్నూరు సన్యాసప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, మెరకముడిదాం మండల నాయకులు తాడ్డి వేణు, బూర్లె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతకు నెలవు ఈ నేల


సత్యసాయి ధ్యానమండలి రజతోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయనగరం: కళలు, ఆధ్యాత్మికతకు నెలవైన విజయనగరంలో పుట్టడం ఒక అదృష్టమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. గురజాడ వంటి ఎంతోమంది మహానుభావులు నడయాడిన ప్రాంతమని గుర్తు చేశారు. శ్రీ సత్యసాయి ధ్యాన మండలి (విజయవాడ) రజతోత్సవ వేడుకలను నగరంలోని ఎస్‌వీఎన్ నగర్ సుజాత కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలిగా కోలగట్ల శ్రావణి.. తొలుత ధ్యానమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు భిక్షమయ్య గురూజీతో కలిసి దత్తాత్రేయ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సత్యసాయి ధ్యానమండలి వారు ఒక పెద్ద కుటుంబాన్ని ఆధ్యాత్మికత వైపు నడిపిస్తున్నారని, మంచి సందేశాన్ని సమాజానికి అందిస్తున్నారని తెలిపారు. ఆధ్యాత్మికత భావాన్ని ప్రజల్లో పెంపొందించడంతో పాటు అనాథ పిల్లలకు అండగా నిలవడం, సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి ప్రజాసేవే పరమార్థంగా నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. అన్నార్తుల ఆకలి తీర్చడం కన్నా, గొప్ప కార్యం మరొకటి ఉండదని భావించి నగరంలో ఉచితంగా భోజనం అందించే ఆరు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను, సేవా భావాన్నే తాను వారసత్వంగా తీసుకున్నానని వెల్లడించారు. ప్రజలంతా ఈర్ష్యను విడనాడి సన్మార్గం వైపు నడవాలని పిలుపునిచ్చారు. సత్యసాయి ధ్యానమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు భిక్షమ య్య గురూజీ మాట్లాడుతూ, మన అంతరంగంలోనే ఆధ్యాత్మికత ఉందన్న విషయాన్ని మరిచిపోయి బయట ఎక్కడో వెతుకుతున్నారని తెలిపారు. ఆధ్యాత్మికంగా ఎదగాలనుకుంటే ఏ సంస్థతోనూ, ఏ గురు వుతోనూ భౌతిక సంబంధం కోరుకోవద్దని హితవు పలికారు. కళలు, సాహిత్యం, ఆధ్యాత్మికతకు విజయనగరం పుట్టినిల్లు కనుకనే ఈ వేడుకలను ఇక్కడ నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం రజతోత్స వ సంచికను అతిథులు ఆవిష్కరించారు. నర్తనశాల అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యా లు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ధ్యానమండలి సభ్యులు కోలగట్ల శ్రావణిని ఉచితరీతిన సత్కరించారు. శశిభూషణ్ గురూజీ, గంగునాయుడు గురూజీ, ధ్యానమండలి సభ్యులు పాల్గొన్నారు.